మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# కస్తూర్బా గాంధీ పాఠశాల తనిఖీ చేసిన కలెక్టర్

### ఆడపిల్లలు చదివితే కుటుంబంతోపాటు సమాజం అభివృద్ధి చెందుతుంది

**మక్తల్ టౌన్, సెప్టెంబరు4 ప్రభాతవార్త:** మక్తల్‌లోని కస్తూర్బా గాంధీ పాఠశాల, బాలికల గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల నిర్వహణ రికార్డులు స్టాక్ రూమ్ వంటగది మరుగుదొడ్లు తదితర వాటిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వంట గదిని, పరిసరాల పరిశుభ్రత నాణ్యమైన కూరగాయలు వాడాలనీ అలాగే వంట సామాగ్రి స్టాక్ రూమ్ పరిశీలించి ప్రతిరోజు పరిశుభ్రమైన వంటను తయారుచేసి కమిటీ పరిశీలించాకే విద్యార్థినులకు వడ్డించాలన్నారు. మెనూబోర్డును పరిశీలించారు. పాఠశాలలో బోధనా విషయంలో ఉపాధ్యాయులు సబ్జెక్టు వైస్‌గా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. గతఏడాది పదవ తరగతి ఫలితాల కంటే ఈ సారి ఇంకా ఎక్కువశాతం ఫలితాలు వచ్చేలా కృషిచేయాలన్నారు. ప్రభుత్వం ఆడపిల్లల చదువుకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం కల్పించిన వసతి సదుపాయాలను ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సతీష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీ రాములు, పాఠశాలల ప్రత్యేక అధికారి, అధికారులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

# యూరియా కొరత లేదు

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో గత సంవత్సరం కంటే ఎక్కువ యూరియా అందుబాటులో ఉందని, రైతులు అనవసర అనుమానంతో పంటకు రెండవసారి వేయాల్సిన యూరియా సైతం ఇప్పుడే కొని పెట్టుకోవాలి అనుకోవడం వల్ల మిగతా రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. గురువారం వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదామును కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం, వాస్తవిక యూరియా నిల్వలను పరిశీలించారు. పిఏసిఎస్ చైర్మన్లు సకాలంలో యూరియా కొరకు డి.డి.లు కట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం అక్కడే రైతులతో మాట్లాడారు. ఇంకా ఒక లోడ్ యూరియా తెప్పిస్తే ఈ ప్రాంతంలో అందరికీ సరిపోతుందని రైతులు కలెక్టర్ కు సూచించారు. స్పందించిన కలెక్టర్ వనపర్తి జిల్లాలో గత సంవత్సరం కంటే ఎక్కువ యూరియా వచ్చిందని, పాత నిల్వలు సైతం ఉన్నాయన్నారు. కేవలం మళ్ళీ యూరియా దొరుకుతుందో లేదో అనే భద్యాందోళనతో కొంతమంది రైతులు ప్రస్తుత అవసరానికి మించి కొనడం వల్ల ఇతర రైతులకు ఇబ్బందులు కలుగుతుందన్నారు. మలి దఫా వేయాల్సిన యూరియా సైతం ఇప్పుడే కొని పెట్టుకోవడం సరి కాదన్నారు. యూరియా నిరంతరం వస్తూనే ఉంటుంది కాబట్టి రైతుకు అనవసర ఆందోళన పడి ఉదయాన్నే లైన్లో వేచి ఉండాల్సిన పని లేదన్నారు. జిల్లాలో గత సంవత్సరం ఇంతకన్నా తక్కువ యూరియా ఉండిందని కానీ ఎక్కడ సమస్య తలెత్తలేదన్నారు. ఇప్పుడు ఎక్కువ యూరియా అందుబాటులో ఉన్నప్పటికినీ సమస్యలు రావడం ఏమిటని అన్నారు. ఇప్పుడు ఎంత అవసరమో అంత మాత్రమే తీసుకెళ్లాలని తర్వాత మళ్ళీ తీసుకోవచ్చని రైతులకు భరోసా కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్, వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, పిఏసిఎస్ సిబ్బంది, రైతులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# మేము సేవకులం

- వెనకబడిన వర్గాలకు అభివృద్ధే లక్ష్యం..
- 70ఏండ్లలో చేపలవాడికి మత్స్యశాఖ కేటాయించడం తొలిసారి
- చాపలు, రొయ్యల పెంపకానికి రూ.122 కోట్ల కేటాయింపు
- జడ్చర్లకు భద్రతా కవచం
- ఆధునిక అగ్నిమాపక కేంద్రం
- ప్రతి మండలానికి ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన సేవలు, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ,క్రీడలు,యువజన సేవలు మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జడ్చర్ల, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** తాము పాలకులం కాదని, సేవకులం అని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన సేవలు, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని జౌకినగర్‌లో నిర్మితమైన సెట్విన్ శిక్షణా కేంద్రం, రూ.47లక్షల వ్యయంతో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ సౌజన్యంతో సి.ఎస్.ఆర్ నిధులతోనిర్మించిన అగ్నిమాపక కేంద్రం నూతన భవనాలను రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ, క్రీడలు, యువజన సేవలు, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ -ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక విభాగానికి తగిన సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఆధునిక పరికరాలు, సిబ్బంది ఈ కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జడ్చర్ల పరిసర ప్రాంతాలకు ఈ కేంద్రం భద్రతా పరంగా మేలైన తోడ్పాటు అందిస్తుంది అని మంత్రి తెలిపారు. మండల స్థాయిలో కూడా అగ్నిమాపక కేంద్రాలు విస్తరించేందుకు తగిన ప్రతిపాదనలు రూపొందించాలని ఆయన సూచించారు.

**ఉపాధి కల్పించేందుకు నైపుణ్య శిక్షణ...**

నిరుద్యోగ యువతకు టెక్నికల్ నైపుణ్యాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ, క్రీడలు, యువజన సేవలు మత్స్యశాఖ మంత్రి వాకిటిశ్రీహరి అన్నారు. జడ్చర్లలో ఏర్పాటుచేసిన సెట్విన్ శిక్షణా కేంద్రం వందలాది యువతకు ఆశాకిరణంగా నిలుస్తుందని అన్నారు. ఈ కేంద్రాల ద్వారా నైపుణ్యాలు అభివృద్ధి చేసుకుని, ఉపాధి మార్గాలను సృష్టించుకోవచ్చు అని అన్నారు. ముదిరాజ్ వర్గ సంక్షేమం75 ఏళ్ల చరిత్రలో ముదిరాజ్ సామాజిక వర్గానికి, మత్స్యశాఖకు నాకు మొదటి మంత్రిగా అవకాశం రావడం గర్వకారణం. నా మొదటి కేబినెట్ సమావేశంలోనే చాపల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసాను. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి 122 కోట్లు కేటాయించారని, అందులో 10 కోట్లు రొయ్యల పెంపకానికి, 84 కోట్లు చాపల కోసం కేటాయించడం జరిగింది. ఇవన్నీ పూర్తిగా పారదర్శకంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ముదిరాజ్ సోదరుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అన్నారు.

**చాపల వాడికే మత్స్యశాఖ..**

75ఏండ్ల స్వతంత్ర్య భారతదేశంలో చాపలకులం వాడికి చాపల శాఖ మంత్రి అంటే మత్స్యశాఖ కేటాయించారని ఇది సమైఖ్య ఆంధ్రాలోనే కాదు దేశ చరిత్రలోనే ప్రథమం అని మంత్రి శ్రీహరి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముదిరాజ్ బిడ్డ మా వాకిటి శ్రీహరి అన్నకు మంత్రి పదవి కేటాయించాలని కోరి పట్టుబట్టిన ఎమ్మెల్యే అనిరుధ రెడ్డి అని, తనకున్న ఐదు శాఖల్లో జిల్లాకు ఏ నిధులు వచ్చినా మొదట జడ్చర్లకు కేటాయించాకే మక్తల్‌కు తీసుకుపోతా అని చెప్పారు. కార్యక్రమంలో మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, వైస్ చైర్ పర్సన్ బాలాది సరిత, ఆర్.డి. ఓ.నవీన్, జిల్లా అగ్నిమాపక అధికారి కిషోర్, హెటిరో ల్యాబ్స్ ప్రతినిధులు సుధాకర్, రవికిరణ్, ఫణి , మున్సిపల్ కౌన్సిలర్ చైతన్య చౌహాన్, మున్సిపల్ కమిషనర్ లక్ష్మా రెడ్డి, తహశీల్దార్ నర్సింగ రావు, తదితరులు పాల్గొన్నారు.



అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, చిత్రంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, జూపల్లి కృష్ణారావు వాకిటి శ్రీహరి ఎమ్మెల్యేలు, జగదీశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ నేతలు

# ఎంత ఎదిగినా .. ఒదిగి ఉండే వ్యక్తిత్వం..


- మితభాషి.. ఆదర్శప్రాయుడు .. జగదీశ్వర్ రెడ్డి
- మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు
- అట్టహాసంగా మహబూబ్‌గర్ పద్మావతి కాలనీలో దివంగత జగదీశ్వర్ రెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపీ , ఎమ్మెల్యేలు , కాంగ్రెస్ నేతలు

**మహబూబ్‌గర్ బ్యూరో సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** 40 ఏళ్లకు పైగా రాజకీయ జీవితం అనుభవించి రెండుసార్లు ఎమ్మెల్సీగా చేసి ఎన్నో పదవులు చూసినా ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం అతని సొంతం అని మంత్రులు వాకిటి శ్రీహరి జూపల్లి కృష్ణారావు కొనియాడారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్టులో మున్సిపల్ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పదేళ్లపాటు రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్న, రాష్ట్రంలోనే అతిపెద్ద ఉమ్మడి పాలమూరు జిల్లాను వివాద రహితంగా అద్భుతంగా కాంగ్రెస్ పార్టీని నడిపిన ఆయన వ్యక్తిత్వం గొప్పదని, ఆయన నడవడిక అందరికీ ఆదర్శనీయం అని చెప్పారు. తొలి తెలంగాణ ఉద్యమంలో పనిచేసి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. ఉమ్మడి జిల్లాను ఒక్కతాటిపైకి తీసుకొచ్చి సమన్వయంతో ఎక్కడా కూడా - మిగతా4లో..

# కన్న పేగును కడతేర్చిన కసాయి తండ్రి

- ఆంధ్రాలో జన్మించి... తెలంగాణలో మృత్యు ఒడిలోకి
- ముగ్గురు పిల్లలను హతమార్చి తాను ఆత్మహత్య....
- కల్వకుర్తి మండలం తాండ్ర శివారులో మోక్షిత, ఉప్పునుంతల మండలం సూర్య తండాలో మరో ఇద్దరి మృతదేహాలు







సూర్య తాండ సమీపంలో మృతి చెందిన చిన్నారులు (ఇన్‌సెట్లో) చిన్నారుల ఫైల్

**కల్వకుర్తి, సెప్టెంబర్4 ప్రభాతవార్త:** తాను కాటికిపోయే వరకు తోడుండి కొరివి పెట్టాల్సిన కన్న బిడ్డలను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కసాయి తండ్రి... అభం శుభం తెలియని అల్లారు ముద్దుగా ఆడుతూ పాడుతూ గడుపుతున్న చిన్నారులను పెట్రోల్ పోసి అతి కిరాతకంగా కాల్చి చంపాల్సిన దుస్థితి ఆ తండ్రికి ఎందు కొచ్చిందో.. మృత్యు ఒడిలోకి చేరుతున్న చిన్నారుల ఆర్తనాదలు ఆ కసాయి తండ్రి గుండె కరిగించలేదా!, చిన్నదెబ్బ తగిలితేనే కన్న బిడ్డ అల్లాడిపోతుంటే తట్టుకోలేని తల్లిదండ్రులు తానే పెట్రోల్ పోసి నిప్పంటించి చంపే అఘాయిత్యానికి ఒడిగట్టిన ఆ కసాయి తండ్రి. ఆలన పాలన చూస్తూ వారి సంరక్షణతో పాటు అనునిత్యం వారికి ఏమి కాకుండా రక్షించుకునే తండ్రి... తన వెంట తీసుకొచ్చిన ముగ్గురు పిల్లల్ని అతి కిరాతకంగా పెట్రోల్ పోసి చంపి తాను ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రకాశం జిల్లా ఎర్రగుంటపాలెం మండలం పెద్ద బోయపల్లి గ్రామానికి చెందిన గుత్తా వెంకటేశ్వర్ల (35)కు, భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యతో గొడవ పడ్డ గుత్తా వెంకటేశ్వర్లు కాలయముడిగా మారాడు. ప్రకాశం జిల్లా నుంచి ఇక్కడివరకు వచ్చిన వెంకటేశ్వర్లు వెల్దండమండలం పెద్దాపూర్ సమీపంలోని చెరువు వద్ద ఆత్మహత్య చేసుకోగా.. ఈనెల 2న వెల్దండ వెల్దండ ఎస్సై కురుమూర్తి సంఘటన స్థలాన్నికి చేరుకొని గుర్తు తెలియని శవంగా భావించి పంచానామా నిర్వహించిన అనంతరం గుత్తా వెంకటేశ్వర్లుగా గుర్తించారు. ఈ క్రమంలో హాజీపూర్ - మిగతా4లో..

### డబుల్ బెడ్ రూమ్

# ఇండ్లను ముస్తాబు చేయాలి

### గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్

**గద్వాల టౌన్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** ఈనెల 6వ తేదీన డబుల్ బెడ్‌రూమ్ గృహాల ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు డబుల్ బెడ్ రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమ - మిగతా4లో..



సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్ సంతోష్



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన స్కార్పియో

# ప్రాణం తీసిన అతివేగం

- కంటైనర్‌ను ఢీకొట్టిన స్కార్పియో..
- వ్యక్తి మృతి: మరో ఇద్దరికి గాయాలు
- జడ్చర్ల ఫ్లై ఓవర్‌పై ఘటన

**జడ్చర్ల, సెప్టెంబరు4, ప్రభాతవార్త :** 44వ జాతీయ రహదారిపై వేగంగా కంటైనర్ ను స్కార్పియో వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం జడ్చర్ల పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై జయప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... కొంపల్లికి చెందిన రోహిత్ తో పాటు మరో ఇద్దరు స్కార్పియో వాహనంలో కొడైకెనాల్ నుండి హైదరాబాద్ వెళుతున్నారు. ఈ తరుణంలోనే జడ్చర్లలోని ఫ్లైఓవర్ పై కంటైనర్ ను స్కార్పియో వాహనం వేగంగా ఢీకొనడంతో రోహిత్ అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామని, మృతుడు రోహిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు పడుతున్నామని ఎస్సై తెలిపారు.

# బంకుల్లో వసతులు లేవా..?

### - కాల్ చేసి ఫిర్యాదు చేయండి



**మహబూబ్‌నగర్, సెప్టెంబరు4, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా పెట్రోల్ డీజిల్ వినియోగదారులకు జిల్లా పౌరసరఫరాల అధికారులు సూచన చేశారు. పెట్రోల్ బంకుల్లో మంచి నీళ్ల లేకపోయినా, వాహనాలకు గాలి సౌకర్యం లేకపోయినా, టాయిలెట్ వాడుకోవడానికి అవకాశం లేకపోయినా, శుభ్రం లేకపోయినా, పెట్రోలు, డీజిల్ కల్తీ జరిగినా, పెట్రోల్, డీజిల్ కొలతలు తేడా వచ్చిన. పెట్రోల్ బంకుల్లో పనిచేసే సిబ్బంది మన పట్ల దురుసుగా ప్రవర్తించిన... జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి కి మొబైల్ నెంబర్ 8008301480 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

### ఎఫ్‌డిఆర్ నిధులను

# నిర్ణీత కాలంలో ఖర్చు చేయాలి

### కేంద్ర విపత్తుల నిర్వహణ శాఖ ద్వారా

### రూ.3కోట్ల నిధులు కేటాయింపు : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** గత ఏడాది 24,25 ఆర్థిక సంవత్సరంలో వనపర్తి జిల్లాలో భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాలకు కేంద్ర విపత్తు నిర్వహణ ద్వారా మంజూరు అయిన 3.00 కోట్ల నిధులను ఖర్చు చేసి యుసిలు సిద్ధం చేసి పంపించేందుకు చర్యలు తీసుకోవాలని - మిగతా4లో..



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

# రోడ్లకు మరమ్మతు చేయాలి

- భూభారతి ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ ఉండొద్దు
- కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం
- జిల్లా,మున్సిపల్ అధికారులతో సమీక్ష

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు4,ప్రభాతవార్త :** వర్షాలకు పాడైన రోడ్లు, ప్రభుత్వ భవనాలను గుర్తించి మరమత్తులు చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వర్షాల వల్ల గుంతలు పడ్డ రోడ్లు, ప్రభుత్వ భవనాలకు చేయవలసిన మరమ్మత్తులపై అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం విపత్తు నిర్వహణ కింద వరదలు, వర్షాలు దెబ్బతిన్న భవనాలు,రోడ్లకు రిపేర్లకు మంజూరు,వ్యయం వివరాలు,బ్యాలెన్స్ నిధులపై సమీక్షించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ప్రస్తుతం 2025 వర్షాలకు గుంతలు పడిన రోడ్లను వెంటనే వాటిని గుర్తించి ప్యాచ్ వర్క్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్, ప్రభుత్వ గ్రామ పంచాయతీ భవనాలు, వార్డ్ ఆఫీసర్ భవనాలు, అంగన్వాడి కేంద్రాలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఎక్కడ ఎటువంటి మరమ్మత్తులు అవసరమో గుర్తించి సంబంధిత అధికారులు వాటి ఎస్టిమేషన్‌ను పంపించాలని. ప్రైమరీ హెల్త్ సెంటర్లు, - మిగతా4లో..

# ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనది

- విద్యకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత
- ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాలలతో నాణ్యమైన విద్య లక్ష్యం...
- రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్4 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, సమాజ నిర్మాణానికి పునాది అని రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఒక విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దడంలో, అతని వ్యక్తిత్వ వికాసంలో, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని భావించి, ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణ పరిధిలోని గగ్గలపల్లి తేజ కన్వెన్షన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, స్థానిక ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా స్థాయికి ఎంపికైన 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులను మెమొంటో, శాలువా, పూలమాలతో సత్కరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్స వంగా నిర్వహిస్తారని మంత్రి జూపల్లి ఈ సంద ర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించుకుంటున్నామన్నారు.

**కుచు కుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ..**

తాము నేడు ఈస్థాయికి రావడానికి కారణం ప్రభుత్వ పాఠశాలల్లో పొందిన మౌళిక విద్యేనని గుర్తుచేశారు. ఆకాలంలో తాము సాధారణ వాతావరణంలో చదువుకున్నప్పటికీ, ఉపాధ్యాయుల అంకితభావం, కృషి, మరియు విద్యా పట్ల ఉన్న నిబద్ధత వల్లే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకున్నామన్నారు. పాఠశాల దశలో మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయుల పేర్లు, వారి పాఠాలు ఇప్పటికీ తన మనసులో నిలిచివున్నాయని పేర్కొన్నారు.

**ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ...**

దేశఅభివృద్ధి తరగతి గది నుంచే ప్రారంభమవుతుందని నమ్మిన ముఖ్యమంత్రి నాయకత్వంలో విద్యాశాఖ పారదర్శకంగా పనిచే స్తోందని చెప్పారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ఎన్నడూ లేనివిధంగా పారదర్శకంగా నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించారని తెలిపారు. గత పదేళ్లుగా ఉపాధ్యాయులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ...**

ప్రతి పిల్లవాడికి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పిస్తూ మెరుగైన విద్య అందిం చేందుకు ఉపాధ్యాయులు కృతనిశ్చయంతో బోధించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతానికి చెందినవారని, విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేసి దేశంలో ఎక్కడా లేని విధమైన విద్య అందించే దుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మంచితనం వల్లే ప్రజల మన్ననలు పొందారని, ఆయన కుమారుడు కూడా ఎమ్మెల్యేగా గెలుపొందడం ఆయన ప్రజాదరణకు నిదర్శనమని పేర్కొన్నారు.

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ..**

దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుంది. ఉపాధ్యాయుల కృషి, మార్గదర్శకత్వం వల్లనే నేను నేడు ఈ స్థాయికి ఎదిగానన్నారు. తన పాఠశాల రోజుల్ని - మిగతా4లో..

## ఎన్‌ఎఫ్‌బిఎస్ పథకానికి దరఖాస్తు చేసుకోండి



కొత్త రైస్ మిల్లు ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

**ఖిల్లా ఘనపురం సెప్టెంబర్ 4, ప్రభాతవార్త;** భర్తలు చనిపోయి దారిద్ర రేఖకు దిగువల ఉన్న నిరుపేద మహిళలు ఎన్ ఎఫ్ బి ఎస్ పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కీమ్యానాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న రైస్ మిల్లు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్మాణం చేపట్టారు లేదా అనేది చూశారు. అనంతరం మండలం తహసిల్దార్ కార్యాలయంలో రికార్డు రూమ్‌లో పరిశీలించారు. భూములకు సంబంధించిన భూభారతి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. మండల కేంద్రంలోని మీసేవ నిర్వాహకులు లబ్ధిదారుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అధిక ఫీజు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యాలయం వచ్చిన దరఖాస్తులు పరిష్కరించాలని తహసిల్దార్ సుగుణకు సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ అధికారి పరమేష్, డిప్యూటీ తాసిల్దార్ లక్ష్మీ క్రాంత్, కురుమూర్తి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## కనుల పండగగా గణనాథుల ఊరేగింపు

***నవాబుపేట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :*** గ్రామస్తులందరూ సమన్వయంతో గ్రామంలోని గణేష్ల నిమజ్జనాన్ని ఒకే వాహనంపై ఒకే శోభాయాత్రతో గ్రామ ప్రజాప్రతినిధుల సమక్షంలో గణేష్ నిమజ్జన శోభయాత్ర కన్నులు పండుగగా జరిగింది. గ్రామంలో ప్రతిష్టించిన 3 కాలనీల వినాయకులను ఊరేగింపుగా వెళుతూ కోలాటం, భజనలు, యువకుల నృత్యాలతో గణేశుల ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. నిమజ్జన ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామస్తులందరూ ఒకే చోట అందరూ కలిసి నిమర్జనం కార్యక్రమాన్ని యువకులందరి సహకారంతోవిజయవంతంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ యాదవ్, చౌదూర్ శేఖర్ యాదవ్, మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు షబ్బీర్ అలీ, నరేందర్, యాదయ్య గౌడ్, అమరేశ్వర్, శ్రీశైలం యాదవ్, రాజేష్ యాదవ్, శివగౌడ్, చాకలి గోపాల్, మహేష్ అతిథులు పాల్గొని నిమజ్జనం చేయడం జరుగింది.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**ఊట్కూర్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల పరిధిలోని వల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 5న జరుపుకునే సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను పాఠశాలలో ఒకరోజు ముందుగానే ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి వృత్తికి మూలం గొప్ప గురువే. ఉపాధ్యాయుని గౌరవించని సమాజం ఎప్పటికీ పురోగతి సాధించదు. అందువల్ల ప్రతి ఒక్కరూ గురువులను గౌరవించాలి" అని అన్నారు.కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులపై పాటలు, కవితలు, ప్రసంగాలతో తమ గౌరవాన్ని తెలియజేశారు. చిన్నారులు నృత్యాలు, నాటికలు ప్రదర్శించి వేడుకలను మరింత అందంగా తీర్చిదిద్దారు. గురువులకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకలో ఉపాధ్యాయులు సత్యపాల్, ఇందిరాదేవి, అంగన్వాడీ టీచర్లు పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని అందరూ ఉత్సాహంగా జరుపుకున్నారు.

## కరెంటు షాక్‌తో మహిళ మృతి

**నవాబుపేట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** పొలంలో అడవి పందుల బెడద నుండి కాపాడుకోవడానికి వేసిన కంచె విద్యుత్ వైర్ల వల్ల షాక్ తగిలి మహిళ దుర్మరణం పాలైన సంఘటన మండల పరిధిలోని జంగమయ్యపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కురువ కెంచె కిష్టమ్మ వయసు 40. గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో మృతి చెంది పడి ఉండడాన్ని గురువారం ఉదయం గమనించిన వ్యవసాయ కూలీలు గమనించి గ్రామస్తులకు తెలియపరచగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదవశాత్తు పంట పొలానికి అడవి పందులకు రక్షణగా వేసిన విద్యుత్ తీగలు మహిళ కాలికి తగిలి విద్యుత్ ప్రసారం జరగడంతో ప్రమాదవశాత్తు ఆ తీగలు తగిలి కిష్టమ్మ మృతి చెంది ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఎస్సై ఎం. విక్రమ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

## కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ సెప్టెంబర్4,ప్రభాతవార్త;** దేశవ్యాప్తంగా అసంఘటితరంగా కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు విలువరించినప్పటికీ అమలుకు నోచుకోకపోవడం పట్ల సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్ రాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వనపర్తి జిల్లాలోని అసంఘటితరంగా కార్మికులతో పాటుగా ప్రభుత్వ కార్యాలయాలకు సేవలందిస్తున్న ఆర్పీలకు అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువడించిన ప్రకారం కనీస వేతనం 26వేల రూపాయలు చెల్లించాలని తద్వారా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కూడా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలంటూ గురువారం రోజు సిఐటియు ఆధ్వర్యంలో ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటితరంగా కార్మికుల చేత పెట్టి చాకిరీ చేయిస్తున్నాయని ప్రస్తుతం ఆర్పీలుగా పనిచేస్తున్న వారితో అదనంగా బిఎల్వోలుగా విధులు నిర్వర్తింపజేస్తూ కార్మికుల శ్రమలు దోచుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్పీలకు కనీస వేతనం 26వేల రూపాయలు చెల్లించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సిఐటి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు పునుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వనజ, పల్లవి, అరుణ, మాధవి తదితరులతో పాటుగా పలువురు ఆర్పీలు పాల్గొన్నారు.

## అరెస్టు చేసిన విఠల్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలి

**భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా**

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** అరెస్టు చేసిన భారతీయ కిసాన్ సంగ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు విట్టల్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ డిమాండ్ చేశారు. అరెస్టుకు నిరసనగా గురువారం నారాయణపేట భారతీయ కిసాన్ సంగ్ జిల్లా కార్యాలయం నందు భారతీయ కిసాన్ సంఘ నాయకులతో సమావేశమై మాట్లాడుతూ అరెస్టు చేసిన కామారెడ్డి జిల్లా అధ్యక్షులు విట్టల్ రెడ్డిని బేషరతుగా ఎలాంటి నిబంధనలు లేకుండా వెంటనే విడుదల చేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షులు బాలప్ప, నగర కార్యదర్శి అంజన్న యాదవ్, గోపాల్ యాదవ్, లక్ష్మీ క్రాంత్ జాజాపురం రాములు కాత్రే, తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ అభినందనలు




ఉప్పునుంతల హైస్కూల్‌లో గురుపూజోత్సవ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**ఉప్పునుంతల,సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** నేడు గురుపూజోత్సవ సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలో టిపిసిసి ఉపాధ్యక్షుడు,నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, సిబిఎం ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ చిక్కుడు అనురాధ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ప్రపంచ దేశాలలో ఆదర్శంగా నిలిచిన మేధావులే గురువులని, గురువులు లేనిది ప్రపంచంలో ఎవరు మేధావులు కాలేరని మీ మేధాశక్తి కి ఇవే మా అభినందనలు అని ఉపాధ్యాయుడికి ఎంతో పవిత్రమైంద ని, గురువులు తయారుచేసిన ఉత్తమ పౌరులు నేడు సమాజానికి ఎంతో ఉపయోగపడతారని అటువంటి వృత్తిలో మీరు చూపే నిబద్ధత అభినందనీయమ ని వారు కొనియాడారు. గురువారం మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతూ నేడు అచ్చంపేట పట్టణంలోని బికే ఫంక్షన్ హాల్లో జరిగే కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని ఆహ్వానిస్తూ అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ వెల్టూర్ రేణయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మేడమోని భాస్కర్, యువజన కాంగ్రెస్ మండల ఇంఛార్జి అంతటి శేఖర్ గౌడ్, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దళితవాడలో అభివృద్ధి జరిగేనా..?

**నిధులు మంజూరైన పనులు చేపట్టలే..**

**రోడ్లపైనే మురుగునీరు**



దళితవాడలో రోడ్లపైనే పారుతున్న మురుగునీరు

**చిన్నచింతకుంట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** దళితవాడ అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తూ వారు సామాజికంగా, ఆర్థికంగా, విద్యా, రాజకీయ రంగాల్లో ముందుండాలని ప్రభుత్వాలు చెపుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం ఆ ఫలితాలు కనిపించడం లేదు.చిన్న చింతకుంట మండలంలోని లాల్ కోట దళితవాడలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి.కాలనీలో డ్రైనేజీ ,సిసి రోడ్డు లేక అస్తవ్యస్తంగా మురుగునీరు రోడ్లపై పారుతూ దుర్వాసన వస్తుందని దళితులు వాపోతున్నారు .ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీటితోపాటు మురుగనీరు కాలనీ బురదమయంగా మారడంతో అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. 2024, 25 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్సీ సబ్ ప్లాన్ కింద కాలనీలో డ్రైనేజీ ,సిసి రోడ్డు నిర్మాణాన్ని గాను 9 లక్షల 50 వేల రూపాయలు మంజూరై నెలలు గడుస్తున్నా పనులు చేపట్టలేదని కాలనీవాసులు వాపోతున్నారు.దళితవాడలో మొండి వెంకటన్న ఇంటి నుంచి కోయిల్ సాగర్ కాల్వ వరకు, బంగారు వెంకటన్న ఇంటి నుంచి ఉన్నత పాఠశాల వరకు డ్రైనేజీ, సిసి రోడ్డు వేయాలని ప్రతిపాదనలుగాను నిధులు మంజూరయ్యాయి.ఇట్టి పనులు చేపట్టేందుకు గ్రామానికి చెందిన బలిజ మల్లేష్ అగ్రిమెంట్ చేసు కుని నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు చేపట్టలేదని దళితవాడ ప్రజలు తెలిపారు. మా సమస్యలు పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ చొరవచూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**నిధులు ఉన్న పనులు జరగటం లేదు**



ఎన్నో ఏండ్లుగా మా కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, దళితవాడ అభివృద్ధికి ఏ ప్రభుత్వం కూడా చొరవ చూపలేదని, మా కాలనీలో డ్రైనేజీ, సిసి రోడ్లకు గాను నిధులు మంజూరైన పనులు చేపట్టలేదు. వర్షాలు వచ్చాయంటే మా దుస్థితి వర్ణనాతీతమని ఇప్పటికైనా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నాం.

***హరిజన హనుమంతు దళిత కాలనీ.***

**పనులు జరిగేలా కృషి చేస్తాను..**



లాల్ కోగ్రామంలో దళిత కాలనీలలో డ్రైనేజీ, సిసి రోడ్డు నిర్మాణాలకు గాను 2024,25 సంవత్సరానికి గాను ఎస్సీ సబ్ ప్లాన్ కింద నిధులు మంజూరయ్యాయని అగ్రిమెంటు చేసుకున్న గుత్తేదారు పనులు చేపట్టేలా స్పెషల్ అధికారి దృష్టికి తీసుకెళ్లి పనులు జరిగేలా కృషి చేస్తాను.

***రాజు పంచాయతీ కార్యదర్శి, లాల్ కోట.***

# గురివింద సామెతలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**బిజినేపల్లి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** తమలోని లోపాలను గుర్తించకుండా గురివింద గింజ తన నలుపెరుగదు అన్నట్లుగా మండల కాంగ్రెస్‌నాయకులు ఇతరులను విమర్శించడం తగదని బిఆర్ఎస్ మండల నాయకులు విమర్శించారు. గురువారం విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులుగా ఉండి గత ప్రభుత్వంలో అక్రమంగా నల్లమట్టి, ఇసుక దందాలు చేసిన వారు ఎన్నికల ముందు పార్టీలు మారి దొంగే దొంగలు అన్నట్లుగా ఉందని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేసే నాయకులు నిన్నటిదాకా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని మాట్లాడిన నాయకులు నేడు సుద్దపూసల్లా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. నేటికీ కొందరు మాజీ ఎమ్మెల్యేతో ఫోన్లో టచ్‌లో ఉన్నారన్న సంగతి బయటపెట్టారు. వారి మాటల వల్లే మర్రి అలా మాట్లాడాల్సిన పరిస్థితి నెలకొనడానికి వాళ్ల పార్టీ వారే కారకులని చెప్పారు. ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలు రాజకీయ బ్రోకర్లను గుర్తించి పూటకో పార్టీ మారే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. 40 ఏళ్లలో జరగని అభివృద్ధిని పదేళ్లలో అభివృద్ధి చేసి పేదల పెన్నిధిగా మర్రి జనార్దన్ రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు వైద్య ఇంజనీరింగ్ చదువుల కోసం ఎంజెఆర్ ట్రస్టు తరఫున సొంతంగా ఫీజులు కట్టి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న నాయకుడు అన్నారు. రైతాంగం ఒక్క యూరియా బస్తా కోసం క్యూ లైన్ లలో నిల్చుని యూరియో రామచంద్ర అంటుంటే రాజకీయ విమర్శలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ కాలం గడుపుతున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ హయాంలో రచ్చబండలవద్దే యూరియా లారీలను తెప్పించి రైతాంగానికి అందించిన ఘనత కెసిఆర్ కి దక్కిందన్నారు. అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని ముందుగా రైతాంగానికి యూరియా అందించి మాట నిలబెట్టుకోవాలన్నారు. రైతుల వద్ద లారీలను దారి మళ్లించిన నాయకులు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో కెఎన్ఆర్ సంస్థ సీసీ రోడ్లు వేస్తే బిల్లులు చేసుకుని భోంచేసిన నాయకుల బండారం బయట పెట్టడానికి తాము సిద్దంగా ఉన్నామన్నారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు పులేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, నాయకులు మహేశ్వర్ రెడ్డి మహేష్ రావు శేఖర్ రావు శ్రీశైలంరెడ్డి తిరుపతిరెడ్డి జుర్రు కృష్ణ, జగదీశ్వర్ రెడ్డి, బాలస్వామి, లక్ష్మయ్య, ఉషన్న,బాలస్వామి, శ్రీనివాస్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో మినీ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



వాటర్ ట్యాంకు ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల్‌టౌన్ సెప్టెంబర్4,ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రం లోని జమ్మి చెడు జమ్ములమ్మ ఆలయ సమీపంలో అర్బన్ రెసిడెన్సి యల్ పాఠశాలలో మినీవాటర్‌ట్యాంక్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅ తిథిగా ఎమ్మెల్యేబండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాల భవనంలోని తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ. పాఠశాలలో ఉన్న సమస్యలను నా దృష్టికి తీసుకోస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తాననీ తెలిపారు. త్వరలోనే పాఠశాల సంబంధించిన హద్దులను బౌండ్రిని మూడు పూర్తి చేస్తామని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో నూతన భవనం ఏర్పాటుకు అదనపు తరగతుల ఏర్పాటు నావంతుగా కృషి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం పాఠశాలలో నాలుగో తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారనీ, విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లి పాఠశాల అప్గ్రేడేషన్ చేసి ఇంటర్మీడి యట్ వరకు విద్యార్థులు చదువుకునే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, ఆలయం కమిటీ చైర్మన్ బోయ వెంకటరాములు,జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు జిల్లా సీనియర్ నేతలు గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్,మాజీ కౌన్సిలర్ మురళి, మాజీ ఆలయం కమిటీ చైర్మన్ సతీష్, ఆలయం కమిటీ డైరెక్టర్ చంద్రశేఖర్ , సంగాల నర్సింహులు, మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం: బిఆర్ఎస్ నేతలు



జెండా ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్

**ఆత్మకూర్ సెప్టెంబర్ 4, ప్రభాతవార్త;** అమలు కానీ హామీలతో అధికారం చేపట్టి రాష్ట్ర ప్రజల ఉసురుతీస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఆత్మకూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు బంగారు శ్రీనివాసులు, ఆత్మకూరు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ తదితరులు తెలిపారు. గురువారం రోజు ఆత్మకూరు మండలంలోని దేవరపల్లి గ్రామంలో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణంతరం వారు మాట్లాడారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించాలని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తుందని గడచిన 20రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు యూరియా దొరకక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వివరిస్తుందని పాలకుల సైతం ఎవరికి తోచే విధంగా వారు ప్రకటనలు గుప్పిస్తూ కలయాపన చేస్తున్నారని వారు తీవ్రస్థాయిలో ఆరోపిం చారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో అమలు కానీ హామీలను గుర్తించి ఆరోగ్యారెంటీ ల పేరిట రాష్ట్ర ప్రజలను వంచించారని రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో హామీల అమలు కోసం నాయకులను నిలదీయాలని ఈ విషయంపై టిఆర్ఎస్ రాజీ లేని పోరాటాలు కొనసాగిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కోటేశ్వర్, లక్ష్మీ క్రాంత్ రెడ్డి, రామకృష్ణ, గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారం కోసం పోరాటం

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్**

**అమరచింత సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** సింగంపేట గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అజయ్ అన్నారు. గురువారం అమరచింత మండలంలోని సింగంపేట గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, మండల అధ్యక్షులు శంకర్ గ్రామ సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేసిన సింగంపేట గ్రామంలో ఏ ఒక్క రైతు రుణమాఫీ కాలేదని వారు అన్నారు. అలాగే గ్రామంలో ఎవరైనా మరణిస్తేస్మశానానికి వెళ్లడానికి రహదారి లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గ్రామంలో విద్యుత్ వైర్లు ప్రమాద భరితంగా ఉన్నాయని వెంటనే విద్యుత్ అధికారులు విద్యుత్ వైర్లను సరిచేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 500 కే సిలిండర్ ఇస్తామని వాగ్దానం చేసిన అమలు కాలేదని ఆయన అన్నారు. ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లతోపాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామంలో ఉపాధి పనులు చేసిన కూలీలకు బకాయిలు ఇవ్వలేదని వెంటనే అధికారులు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తన్న, ఆంజనేయులు, పార్వతమ్మ, శాంతమ్మ, కథలన్నా, యువకర్ణ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో హిందూ వాహిని ఆధ్వర్యంలో రాస్తారోకో



హిందూ వాహిని సంస్థ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ సెప్టెంబర్4,ప్రభాతవార్త;** ఆత్మకూరు పట్టణంలోని గాంధీ చౌరస్తాలో గురువారంరోజు హిందూవాహిని ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.పట్టణంలో గురువారం రోజు సామూహిక వినాయక నిమజ్జన కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి ఒక వర్గానికి చెందిన యువకులు జెండాలను కరెంటు స్తంభాలపై కట్టడంతో హిందూవాహిని సంస్థసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం రోజు మిలాద్ ఉన్ నబీ పండగ ఉన్న నేపథ్యంలో ఒకరోజు ముందుగానే వినాయక నిమజ్జనోత్సవం నిర్వహించాలని హిందూసంస్థలు నిర్ణయించడంతో మరోవర్గం వారు జెండాలను కట్టడంతో ఆగ్రహానికి గురయ్యాయి. మరోవర్గం కట్టిన జెండాలు తీసే వరకు వినాయక నిమజ్జనం నిర్వహించబోమంటూ దిష్మించుకుని రాస్తారోకోక పూనుకోవడంతో ఆత్మకూర్ సీఐ శివకుమార్ ఎస్ఐ నరేందర్లు ఇరువర్గాలతో చర్చించి మరోవర్గం కట్టిన జెండాలను తీపించడంతో హిందూసంస్థ సభ్యులు శాంతించారు.గురువారం రోజు సామూహిక నిమజ్జనం నిర్వహించాలని నిర్ణయించడంతో ఎట్టకేలకు సమస్య కొలిక్కి వచ్చినట్లు అయింది. హిందు వాహిని సంస్థ సభ్యులు రాస్తారోకో నిర్వహించుతున్న సందర్భంలో ఉద్రిక్తత నెలకొనడంతో వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు ఆత్మకూరుకు చేరుకుని పరిస్థితిని సద్దుమణిగించారు.ఈకార్యక్రమంలో అఖిలపక్ష పార్టీలకు చెందిన నాయకులు హిందూ హాయిని సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



చిన్నారులతో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :**నారాయణపేట పట్టణంలోని పలు గణేశ్ మండపాలను గురువారం ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి సందర్శించి వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి గణనాథులను దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం వినాయక మండపాలనిర్వాకులకు ఎమ్మెల్యేనుశాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా, పట్టణ నాయకులతో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులలో విద్యా ప్రమాణాలు పెరగాలి



రికార్డులు పరిశీలిస్తున్న మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు

**ఇటిక్యాల సెప్టెంబర్ 4, ప్రభాతవార్త;** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులలో విద్యా ప్రమాణాలు పెంచేలా ఉపాధ్యాయులు బోధించాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండల పరిధిలోని మొగలి రావాల్ చెరువు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరియు పాఠశాలకు సంబంధించి వివరాలను సమస్యలను ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ ను అడిగి తెలుసుకున్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

**ఉప్పునుంతల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** అఖిల భారత విద్యార్థి పరిషత్ ఉప్పునుంతల మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం కంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మేడి పూరి మల్లికార్జున్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు మహేష్, భాను, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్ భూతాన్ని తరిమేద్దాం

**బిజినేపల్లి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** ర్యాగింగ్ భూతాన్ని తరిమివేసి, సురక్షి తమైన, స్నేహపూర్వక విద్యా వాతావరణాన్ని సృష్టించుకుందామని ఎస్ఐ కె. శ్రీనివాస్ అన్నారు. పాలెం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ర్యాగింగ్ పై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది మానవత్వ విలువల విరుద్ధమని, ఇది విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుందని చెప్పారు.వైస్ ప్రిన్సిపల్ చరణ్ తేజ్ మాట్లాడుతూ ర్యాగింగ్ కారణంగా విద్యార్థుల మధ్య స్నేహభావం కొరవడుతుంది, ఇది విద్యా వాతావరణాన్ని కలుషితం చేస్తుందన్నారు. ర్యాగింగ్ మానసికంగా కృంగదీసి ఆత్మహత్యలకు కూడా దారితీస్తుంది అని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు గాడి పార్వతి సంతోషిణి విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చతుస్థానార్చన పూర్ణాహుతి

**బిజినేపల్లి,సెప్టెంబరు4 ప్రభాతవార్త:**పట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాల్లో చతుస్థానార్చన పూర్ణాహుతి అంకురార్పణ నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణ మధ్య మదలర్మేల్ మంగ గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల ద్వారా గాని తెలిసి తెలియక చేసే తప్పులకు ప్రాయశ్చిత్తంగా పవిత్ర మాలలు ధరిస్తారని అర్చకులు తెలిపారు . దేవస్థాన వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాప్ రెడ్డి, సందడి రామచంద్రారెడ్డి, కొర్త చంద్రా రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దేవస్తాన స్థానాచార్యులు సముద్రాల శ్రీమన్నాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బోయాపూర్లో వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

**బిజినేపల్లి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** బోయాపూర్ గ్రామంలో ఆదివారం స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ చేస్తున్నట్లు బీసీ సంఘాల నాయకులు తెలిపారు. బహుజన మేధావులు బీసీ సంఘాల నాయకులు బడుగు బలహీన వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంఘం నాయకులు అంతటి రాజేందర్ గౌడ్ దాసర్ల వెంకటస్వామి కోరారు.

## మల్బరీ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

**నవాబ్‌పేట,సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** మల్బరీ పంటను సాగు చేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని బుధవారం మండల పరిధిలోని కొత్తపల్లిలో సాగు చేసిన మల్బరీ పంటను,పట్టు గూళ్లను,షెడ్లను ఎంపీడీవో జయరాం నాయక్ ,ఏపీవో జ్యోతి పరిశీలించారు.రైతులతో ముఖాముఖి మాట్లాడారు.పట్టు సాగులో వచ్చే లాభనష్టాలు గురించి తెలుసుకున్నారు. రైతులు ఒకే పంట వేయకుండా ఇతర పంటలపై ముక్కు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ జ్యోతి రైతులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి గణనాథులు



గణనాథున్ని నిమజ్జనానికి తరలిస్తున్న విద్యార్థులు

**లింగాల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని వివిధ వాడల్లో ఏర్పాటు చేసిన గణనాథులు తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు గురువారం చివరి రోజున గంగమ్మ ఒడిలోకి చేరాడు. గురువారం ఉదయం నుంచి ఆజాద్ యువక బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు వివిధ రూపాల్లో భక్తుల చేత పూజలందుకున్నారు. గణనాథుని పెద్ద లడ్డు రూ.51 వేలు నాయకపు వీరాస్వామి, చిన్న లడ్డు రూ.31 వేలు,10 రూపాయల బిళ్ళ వద్ల నిరంజన్ వేలం పాటలో కైవసం చేసుకున్నారు. విగ్రహ దాత మల్లెపల్లి జయమ్మ, అశోక్ రెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆజాద్ యువక బృందం సభ్యులు చెన్న శ్రీనివాసులు, గువ్వల బాలరాజు,కొత్త రామకృష్ణ, కందుల చిరంజీవి, అశోక్, సంతోష్, నిరేష్, శ్రీకాంత్, నవీన్, శివ ఆజాద్ యువక బృందం సభ్యులు పాల్గొన్నారు.

**నారాయణపేటలో..**

నారాయణపేటలోని హంసవాహిని స్కూల్లో చవితి గడియల్లో ప్రతిష్ఠించిన గణనాథుని నవరాత్రులు ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం కొండారెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేష్ కుమార్ ఉపాధ్యాయులు నమ్రత, అమల,విజయ,షమీనా, ఉదయ్,విద్యార్థులు పాల్గొన్నారు.

**చిన్న చింతకుంటలో..**

మండలంలోని ఆయా గ్రామాలలో శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. గురువారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో



గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆయా వినాయక మండపాల వద్ద నిర్వాకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మహిళల కోలాటాలు నిర్వహించి, కొత్తపల్లి వద్ద కృష్ణా నదిలో నిమజ్జనానికి చేశారు.

**భూత్పూర్‌లో..**

భూత్పూర్ మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డు బీసీ కాలనీలో కొలువుదీరిన విఘ్నేశ్వరులు భాజా భజంత్రీల ఊరేగింపుతో నిమజ్జనానికి బయలుదేరారు. బీసీ కాలనీలోని ఠాగూర్ మెమోరియల్ స్కూల్‌లో విద్యార్థులు ప్రతిష్ఠించిన బుజ్జిగణపతిని విద్యార్థులు ఆటపాటలు, కోలాటాలు మధ్య గణపతిని ఊరేగిస్తూ సమీపంలోని కథాల్‌ఖాన్ చెర్వుకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ గొడుగు వెంకటయ్య,ప్రిన్సిపాల్ కాడ్లూర్ చాముండేశ్వరిలతో పాటు ఉపాధ్యాయురాళ్లు మాధవి, సన, సృష్టి, వినీత్ పాల్గొన్నారు.

**సంజీవరాయ దేవస్థాన సంఘం ఆధ్వర్యంలో..**

బీసీకాలనీ తొమ్మిదోవార్డులో సంజీవరాయ దేవస్థాన సంఘం సభ్యులు ప్రతిష్ఠించిన వినాయకుడిని కథాల్‌ఖాన్‌చెర్వుకు తరలించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అర్వ విజయ్‌కుమార్, గొడుగు నాగరాజు, తోక శివశంకర్‌గౌడ్, జశ్వంత్, చందు, పార్థసారథి, లోకేష్, సోమేష్ ఊరేగింపు నిర్వహించారు.

బీసీ కాలనీలోనే పంచవటీ రోడ్‌లో ఫ్యామిలీ వినాయక సంఘ సభ్యులు ప్రతిష్ఠించిన వినాయక విగ్రహ నిమజ్జనం గురువారం ఘనంగా నిర్వహించారు. వినాయకుడిని అందంగా అలంకరించి భారీ ఊరేగింపు నిర్వహించారు. వినాయకుడిని బీచుపల్లి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.కార్యక్రమంలో వెంకటరెడ్డి, రవీందర్‌రెడ్డి, చారీ, ధనలక్ష్మి, దీక్షిత్,సువర్ణతో పాటు పలువురు భక్తులు,కాలనీవాసులు పాల్గొన్నారు.



## హనుమాన్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమం

**బాలానగర్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డు హనుమాన్ కాలనీ గణనాథునికి గత 9 రోజులుగా నిత్యం భక్తిశ్రద్ధలతో పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 9వ రోజు ప్రత్యూష, వినయ్ కుమార్‌ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కొండేరులో మట్టి వినాయకుడికి ప్రత్యేక పూజలు

**ఇటిక్యాల, సెప్టెంబర్ 4,ప్రభాతవార్త:** కొండేరు గ్రామంలో వినాయక చవితి సందర్భంగా హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో సుంకులమ్మ గుడి ఆధ్వర్యంలో పర్యావరణాన్ని రక్షించేందుకు మట్టి వినాయకుని ప్రతిష్ఠించారు. రంగులు వాడడం వల్ల నీరు కలుషితం అవుతుందని అందరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని సభ్యులు కోరారు.

## రూ.70 వేలకు లడ్డూ వేలంలో దక్కించుకున్న శ్రీధర్ రెడ్డి

**రాజాపూర్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** రాజాపూర్‌లోని శివ సీతారామ ఆంజనేయ స్వామి ఆవరణలో భగత్ సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపయ్య వద్ద బుధవారం రాత్రి లడ్డు వేలం నిర్వహించగా రూ.70 వేలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన ముంగనూరు శ్రీధర్ రెడ్డి దక్కించుకున్నారు. శ్రీధర్ రెడ్డిని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ముస్తాబు చేయాలి

(మొదటి పేజీ తరువాయి భాగం)

ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈనెల 6వ తేదీ శనివారం రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి గారు డబుల్ బెడ్ రూమ్ గృహాల ప్రారంభోత్సవానికి రానున్నందున, అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.ఎంపికైన లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా పట్టాలు అందజేయనున్నట్లు తెలిపారు.715 మంది ఎంపికైన లబ్ధిదారులు,వారి కుటుంబ సభ్యులను కార్యక్రమానికి హాజరు అయ్యేలా మున్సిపల్ కమిషనర్ సమన్వయం చేయాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్లులక్ష్మీనారాయణ, నర్సింగరావు,హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, ఆర్డిఓ అలివేలు, డిపిఓ నాగేంద్రం, కమిషనర్లు,ఎంపిడిఒలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనది

(మొదటి పేజీ తరువాయి భాగం)

ఈ సందర్భంగా స్మరించుకున్న ఆయన, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఉపాధ్యాయుల సమర్పణ ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యా వ్యవస్థ బలోపేతానికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని, గతంలో 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో 23వ స్థానంలో ఉన్న జిల్లా, ఉపాధ్యాయుల కృషితో 13వ స్థానానికి చేరుకుందని, ఇది ఉపాధ్యాయుల సమర్పణకు నిదర్శనం అని కలెక్టర్ అన్నారు. అనంతరం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను అత్యంత ఘనంగా మెమొంటో శాలువాతో సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదికను విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కనులపండుగలా సాగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల కృషి, వారి సేవలను గౌరవిస్తూ ఘన సన్మానాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఏ రమేష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు నూరుద్దీన్, శోభారాణి, కిరణ్ కుమార్, మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎఫ్‌డిఆర్ నిధులను నిర్ణీత కాలంలో ఖర్చు చేయాలి

(మొదటి పేజీ తరువాయి భాగం)

ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. గత వర్షం వరదల వల్ల ఎక్కడెక్కడ నష్టం వాటిల్లిందొ వాటికి మరమ్మతుల కొరకు ఖర్చు చేసిన బిల్లులు సిద్ధం చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ, రోడ్డు భవనాలు, సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల , మున్సిపాలిటీ శాఖలకు సంబంధించిన నష్టాలు, చేపట్టిన మరమ్మతు పనులను కలెక్టర్ సమీక్షించారు. ఎడతెరపి లేని వర్షాల వల్ల డ్యామేజ్ అయిన అంగన్వా డి భవనాలు, రోడ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మహిళా సంఘ భవ నాలు, మిషన్ భగీరథ ట్యాంకులు తదితర మరమ్మతుల కోసం కేంద్ర విపత్తుల నిర్వహణ శాఖ ద్వారా రూ.3 కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని, వాటిని సకాలంలో సద్వినియోగం చేసుకొని యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. పనులు ఎంత మేరకు పూర్త య్యాయి, ఎన్ని పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరి వరకు పనులను సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడెక్కడ ఎంత నష్టం జరిగిందో నివేదిక ఇవ్వాలని వాటికి సంబంధించిన మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో విద్యాశాఖ అధికారి మహమ్మద్ గని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. శ్రీనివాసులు, మున్సిపాలిటీ కమిషనర్లు, ఆర్అండ్‌బి అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, డి.సెక్షన్ సూపరింటెండెంట్ మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కురుమూర్తి స్వామి హుండీ ఆదాయం..రూ.7.03 లక్షలు

**చిన్న చింతకుంట, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి స్వామి హుండీ ఆదాయం గురువారం లెక్కించారు. హుండీలోని నగదును ఆలయ ఈవో మధనేశ్వర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ అధికారి తిరుపతయ్య సమక్షంలో లెక్కించగా రూ.7 లక్షల 3 వేల 116లు హుండీ ద్వారా ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, ఉంద్యాల శేఖర్, బాదం వెంకటేశ్వర్లు, నాగరాజు, భక్తుడు కురుమూర్తి వెంకటేశ్వర రెడ్డి, అర్చకులు వెంకటయ్య, లక్ష్మీ నరసింహ, సిబ్బంది, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్లకు మరమ్మతు చేయాలి

(మొదటి పేజీ తరువాయి భాగం)

సబ్ సెంటర్ లు,ప్రైమరీ వెటర్నరీ సెంటర్ లు, ఎస్టిమేషన్ రాష్ట్రస్థాయి కార్యాలయానికి పంపించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

**ఒక్క అప్లికేషన్ పెండింగ్ ఉండొద్దు..**

భూ భారతి రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన ఏ ఒక్క అప్లికేషన్ ను పెండింగ్ లో పెట్టకుండా వెంటనే పూర్తి చేయాలని తహశీల్దార్ లను కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తహశీల్దార్ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, భూభారతిలో వచ్చిన అప్లికేషన్లను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, రిజెక్ట్ అయిన అప్లికేషన్లు, పరిష్కరించిన అప్లికేషన్లు, పెండింగ్లో ఉన్న అప్లికేషన్ల వివరాలను మండలాల వారీగా జిల్లా కలెక్టర్ సంబంధిత మండల తహశీల్దార్ లను అడిగి తెలుసుకున్నారు. మూసాపేట మండలంలో నిర్మాణం పూర్తి చేసిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని గృహ నిర్మాణ, రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, మహిళ శిశు సంక్షేమ అధికారిని జరినా బేగం, జిల్లా వెటర్నరీ అధికారి మధుసూదన్ గౌడ్, డిపిఓ పార్థసారథి, ఈఈ పంచాయతీరాజ్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, దేవరకద్ర, జడ్చర్ల, భూత్పూర్ మున్సిపల్ కమిషనర్లు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దోషులను శిక్షించేందుకే సిబిఐకి అప్పగింత

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు4,ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టు లో జరిగిన అవినీతి పైన విచారణ జరిపి దోషులను సత్వరమే శిక్షించేందుకే ముఖ్యమంత్రి సిబిఐకి కేసును అప్పగించారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ యువజన క్రీడలు శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘోష్ కమిటీ ఇచ్చిన రిపోర్టును క్యాబినెట్ అసెంబ్లీలో చర్చించకు పెట్టింది, హోష్ కమిటీ నివేదిక చూసిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు లో ఏవిధంగా తప్పు జరిగింది అనేది ఆ నివేదిక చూసిన తర్వాత స్పష్టంగా అర్థమవుతోంది అన్నారు. తప్పు చేసిన దోషులను శిక్షించాలంటే జరిగిన అవినీతిపైన సమగ్ర విచారణ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆలోచన చేశారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో రాష్ట్ర పోలీసు వ్యవస్థ ఉంటుందన్నారు. ఇక్కడ ఘోష్ కమిటీ ఇచ్చిన నివేదికలో అంతర్రాష్ట్ర నదీ జలాలకు సంబంధించి విషయం ఉంది , తుమ్మిడి గడ్డ ప్రాజెక్టును మేడి గడ్డ కు మార్చడం, సిడబ్ల్యుసి ఇచ్చిన లేఖల ఆధారం, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వారిచ్చిన రిపోర్టులు అన్ని రిపోర్టులను ఆధారంగా ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ రిపోర్టు ఇచ్చిందన్నారు. దోషులకు శిక్ష పడాలంటే మరింత విచారణ వేగవంతం చేయాలంటే , డిల్లీ కేంద్రంగా ఉండే సంస్థల నుంచి డాక్యుమెంట్స్ రావాలంటే రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే పోలీసులు కానీ మిగతా ఏజెన్సీలు ప్రయత్నం చేస్తే రావన్నారు. సాధారణంగా పెద్ద ప్రాజెక్టులకు ఏడు నుంచి ఎనిమిది శాతం ఇంట్రెస్ట్ ఉంటుందని కానీ లక్షల కోట్లు తెచ్చిన ప్రాజెక్టుకు 10.5 ప్రకారం ఇంట్రెస్ట్ తెచ్చారు అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలను బ్యాంకులను వాటిని ఎంక్వయిరీ చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పోలీసు వ్యవస్థలు ఇతర ఏజెన్సీలకు అధికారాలు ఉండవన్నారు. కాబట్టి సత్వర విచారణకు సిబిఐ కరెక్ట్ అని చెప్పి టెక్నికల్ అంశాలలో కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ముఖ్యమంత్రి గారు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన చెప్పారు. ఇంత పెద్ద స్కామ్ జరిగింది కాబట్టి ముఖ్యమంత్రి క్యాబినెట్ చర్చించి సిబిఐ కి అప్పగించారని ఆయన అన్నారు బిజెపి నాయకులు ఆక్షేపించడానికి ఏమీ లేదని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్ ఉన్నారు.

# ఉత్తమ అధ్యాపకుడిగా డా.మధుసూదన్‌రెడ్డి

- **35పరిశోధనలు, 11పుస్తకాలకు పబ్లిషర్**
- **సేవలను గుర్తించి పురస్కారం**
- **అభినందించిన పీయూ వీసీ, రిజిస్ట్రార్**



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 4,ప్రభాతవార్త:** పాలమూరు బిడ్డకు మరో అరుదైన పురస్కారం లభించింది. పాలమూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ డి మధుసూదన్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక అవార్డు ప్రకటించింది. జోగులాంబ గద్వాల జిల్లా మానపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన ఆయన రాష్ట్రస్థాయిలో ఎన్నో ఉత్తమ అవార్డులు పొందారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్ అవార్డుల్లో మధుసూదన్‌రెడ్డి ఉత్తమ అధ్యాపకుడి అవార్డు పొందారు. డాక్టర్ డి మధుసూదన్ రెడ్డి 25 సంవత్సరాల యూజీ, పీజీ బోధన అనుభవం కలిగి ఉన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం నుండి డిపార్ట్మెంట్ ఆఫ్ మైక్రో బయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి మధుసూదన్ రెడ్డిని ఉత్తమ అధ్యాపకుడిగా నియమించారు. డాక్టర్ డి మధుసూదన్ రెడ్డి జాతీయ అంతర్జాతీయ 35 పరిశోధనా పత్రాలు సమర్పించారు. 11 పుస్తకాలను జాతీయ అంతర్జాతీయ పబ్లిషర్స్ ప్రచురించారు. 2 రీసెర్చ్ 56 లక్షల వ్యయంతో ప్రాజెక్టులు చేస్తున్నారు. ఒక్క పేటెంట్ కలిగి ఉన్నారు. డాక్టర్ డి మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో ఆరుగురు రీసెర్చ్ స్కాలర్స్ పనిచేస్తున్నారు. అందులో ఇద్దరికీ పిహెచ్డి డాక్టరేట్ అవార్డు పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి పొందారు. పాలమూరు విశ్వవిద్యాలయంలో మైక్రో బయాలజీ విభాగాధిపతిగా, ప్రిన్సిపల్ గా, చైర్ పర్సన్ గా, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ గా, డైరెక్టర్ అక్కడమిక్ ఆడిట్ సెల్, రీజినల్ కోఆర్డినేటర్ ఐసెట్, క్యాంప్ ఆఫీసర్ ఎడ్ సెట్, రిజిస్ట్రార్ గా వివిధ స్థాయిలలో బాధ్యతలు నిర్వహించారు.విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి రమేష్ బాబు రిజిస్ట్రార్ అభినందించారు.

# ఎమ్మెల్యే చొరవతో ఆలయాభివృద్ధి

### ఆలయ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి

**నవాబుపేట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** జడ్చర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చెరువుతో ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని పర్వతాపూర్ మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఆలయంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చొరవతో ఆలయ కార్మికుల వేతనం రూ.7500 నుండి రూ.12 వేలకు పెంచామన్నారు. అలాగే 15సంవత్సరాలుగా ఆలయంలో కొనసాగుతున్న కట్ట మల్లేష్ కు దేవాదాయ శాఖ తరపున ఆర్డర్ కాపీ ఇవ్వడం జరిగిందన్నారు. అతి త్వరలో అటవీ శాఖ ఆర్ ఎఫ్ ఆర్ సర్టిఫికెట్ రావడం జరిగిందని ఐదు ఎకరాలుగా ఉన్న పర్వతాపూర్ మైసమ్మ ఆలయ భూమి 11 ఎకరాలకు విస్తరించాలని కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చామని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని కోటి రూపాయల విరాళం కూడా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్సింలు, చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, కమిటీ సభ్యులు ఉన్నారు.

## టోకెన్లు ఇచ్చినా..యూరియా ఇవ్వలె..

**ఖిల్లా గణపురం, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త;** మండలంలో యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉదయం ఏడు గంటల నుండి టోకెన్ల కోసం రైతు వేదిక దగ్గర నిలబడి రాయించుకున్నా కూడా యూరియా ఇచ్చే సింగల్ విండో కార్యాలయం దగ్గరికి వచ్చి క్యూ లైన్ లో ఉన్నా యూరియా అయిపోయిందని చెప్పడంతో రైతులు అధికారులను, సిబ్బందిని తిట్టుకుంటూ వెనుదిరిగారు. వరి చేలు నాటి 20 రోజులు గడిచిపోతున్నా కూడా యూరియా చల్లకపోవడంతో కనీసం పెట్టుబడులు కూడా వచ్చే వీలులేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి మల్లయ్యను వివరణ కోరగా మండలంలో వరి 14 వేల ఎకరాలకు పైగా నాటు వేశారని, ఆరుతడి పంటలు 4,800 ఎకరాలకు పైగా వేశారని ఇప్పటికే 40 వేలకు పైగా యురియా బస్తాలు మండలానికి వచ్చాన్నారు. ఇంకా 3వేలుబస్తాలు వస్తే సరిపోతుందఅన్నారు.



క్యూ లైన్ లో వేచి ఉన్న రైతులు

## హెల్త్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** జిల్లాలోని మధుమేహం, క్షయ వ్యాధిగ్రస్తుల విస్తృత ప్రయోజనార్థం రూపొందించిన వనపర్తి హెల్త్ యాప్‌ను రోగులతో పాటు వైద్యులు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టర్ వనపర్తి మండలం కడుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అదేవిధంగా ఈ యాప్ లో లెప్రసి వ్యాధిగ్రస్తుల వివరాలు, హెచ్.ఐ.వి వ్యాధిగ్రస్తుల వివరాలు సైతం అప్లోడ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పిహెచ్‌సి లో వైద్యం పొందుతున్న బాలింతలతో కలెక్టర్ మాట్లాడారు.జిల్లా వైద్య అధికారి డా. శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్ డా. సాయినాథ్ రెడ్డి, డా. పరిమళ, వనపర్తి మండల తహసిల్దార్ రమేష్ రెడ్డి కలెక్టర్ వెంట ఉన్నారు.



వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

## ఘననాథుని సేవలో ఎమ్మెల్యేలు..

### శంకర్ గంజ్ వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి,సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని శంకర్ గంజ్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గణపతిని గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, స్థానిక మాజీ కౌన్సిలర్ బ్రహ్మం చారి, ఎస్ఎల్ఎన్ రమేష్ పాల్గొన్నారు.



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## నిమజ్జనం ఏర్పాట్లను పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథులను నిమజ్జనం కోసం కొండారెడ్డిపల్లి చెరువు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి సందర్శించి పరిశీలించారు. అనంతరం మునిసిపల్ ఏఈ తో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిమజ్జనానికి వచ్చే గణేష్ మండపాల నిర్వాహకులకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట ఏఈ మహేష్, మేనేజర్ మహమ్మద్ అజీమ్, శానిటరీ ఇన్స్పెక్టర్ తిప్పన్న, నరేష్ తో బాటు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం అన్నదాతల పాట్లు

**ధన్వాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** ధన్వాడ సింగిల్ విండో ఆఫీస్ వద్ద రైతులు ఉదయం 5 గం.ల నుండి యూరియా కోసం క్యూలో నిలబడి ఉండడాన్ని గమనించిన మాజీ ఎంపీటీసీ గౌని శ్రీనివాసులు వారికి పండ్లు, నీళ్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు. రైతులు తిండి తిప్పలు మాని యూరియాకోసం ఎదరుచూస్తున్నా సర్కారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎస్‌జీడీ కంపెనీ సమస్యలు పట్టించుకోరా..

### బీజేపీ యువనేత కొండాప్రశాంత్‌రెడ్డి

**దేవరకద్ర, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** నియోజకవర్గం మూసాపేట మండలం వేముల గ్రామంలో ఎస్‌జీడీ ఫార్మా కంపెనీ రెండో యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి కంపెనీ సమస్యలు గాలికి వదిలేసి మొత్తం రాజకీయమే మాట్లాడటం ఆశ్చర్యకరంగా ఉందని బీజేపీ యువనేత బీజేపీ కొండాప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. ఎస్‌జీడీ ఫార్మా కంపెనీ సమస్యలు..కంపెనీలో పనిచేయుటకు ఎక్కువగా లోకల్ వాళ్లను తీసుకోకపోవడం...లోకల్ వాళ్లను తీసుకున్నగాని వాళ్లను పర్మి నెంట్ చేయకపోవడం,స్థానికుల జీతాలు ఇతర రాష్ట్రాల వారితో పోలిస్తే చాలా తక్కువగా ఇవ్వటం... ఇంక్రిమెంట్లు ఇవ్వకపోవడం కనీస వేతనం అమలు చేయడం లాంటి సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

## ఎంత ఎదిగినా .. ఒదిగి ఉండే వ్యక్తిత్వం

(మొదటి పేజీ తరువాయి భాగం)

ఇబ్బందులు రాకుండా పార్టీకి నడిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

### రాజకీయంగా అడుగులు వేయించిన వ్యక్తి

**సీ డబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి**

నాకు రాజకీయంగా అడుగులు వేయించిన వ్యక్తి అని సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి జగదీశ్వర్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. జగదీశ్వర్ రెడ్డి అంటేనే నమ్మకం అని, కులం బంధుత్వం తో సంబంధం లేకుండా కేవలం వ్యక్తిత్వం యోగ్యత ఆధారంగా పదవులు కేటాయించిన గొప్ప మహానుభావుడు జగదీశ్వర్ రెడ్డి అని కొనియాడారు. తాను ఇంకా ఎంత ఎత్తుకు ఎదిగినా తనకు రాజకీయంగా అడుగులు వేసిన వ్యక్తి జగదీశ్వర్ రెడ్డి అని సగర్వంగా చెబుతున్నాను అన్నారు. ఉమ్మడి పాలమూరులో పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి, ఆయన నాకు అందించిన ప్రోత్సాహం ఎన్నటికీ మరిచిపోలేను అన్నారు. ఈరోజు పాలమూరులో పార్టీ పటిష్టంగా ఉంది అంటే ఆనాడు జగదీశ్వర్ రెడ్డి వేసిన అడుగులే అని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ మల్లు రవి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిన్నారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు , దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, యశస్విని మాట్లాడారు. ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శిలు వినోద్ కుమార్,సంజీవ్ ముదిరాజ్ , మిథున్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, సీజే బెనహర్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కన్న పేగును కడతేర్చిన కసాయి తండ్రి

(మొదటి పేజీ తరువాయి భాగం)

నుంచి పలు ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించి అచ్చంపేట, ఉప్పునుంతల, వెల్దండ పోలీసులు బృందాలుగా ఏర్పడి పిల్లల కోసం వెతికారు.

**కన్న తండ్రే కాలయముడయ్యాడు..**

తన ముగ్గురు పిల్లలను ముద్దుగా, అప్యాయంగా చూసుకోవాల్సిన తరుణంలో కుటుంబ సమస్యలతో ఆగస్టు 3న తన ముగ్గురు పిల్లలతో దోర్నాల మీదుగా డిండికి బైక్ పై వచ్చి వర్షిని (6), శివధర్మ (4) అనే ఇద్దరు చిన్నారులను అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల మండలం సూర్య తండా సమీపంలో వన్య ప్రాణులు కూడా సంచరించని గుంటల ప్రాంతంలో తీసుకెళ్లి పెట్రోల్ పోసి తగులబెట్టాడు. మరొక కుమార్తె మోక్షిత (8)ను కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామ శివారులో పెట్రోల్ పోసి జాలీ, కరుణ దయ లాంటివి లేకుండా క్రూరంగా హతమర్చాడు.



కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు